క్లుప్తంగా

లీకేజీకి మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌లో డీ–16 కెనాల్ మిషన్ భగీరథ పైపులైన్ వాల్వ్ వద్ద లీకేజీ ఏర్పడింది. దీనిపై ఈనెల 14న 'సాక్షి'లో వృథాగా భగీరథ జలం శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన భగీరథ అధికారులు మంగళవారం రాచాపూర్‌లో వాల్వ్‌ను సరి చేసి లీకేజీని అరికట్టారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నూతన నియామకం



నియామక పత్రం అందిస్తున్న భవాని

కడెం: కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల ఉపాధ్యక్షురాలిగా కడెంకు చెందిన నుస్రత్‌ఫాతిమా నియమితులయ్యారు. మంగళవారం ఆమెకు మండల కేంద్రంలో కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ దుర్గభవాని నియామక పత్రం అందజేశారు. ఇందులో మండలాధ్యక్షురాలు సురేఖ, జిల్లా ఉపాధ్యక్షురాలు గంగవ్వ తదితరులున్నారు.

సన్మానం



సన్మానిస్తున్న కాలనీవాసులు

ఖానాపూర్: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సునీత–పోశెట్టి దంపతుల కూతురు అన్నురేచల్ ఇటీవల ఎంబీబీఎస్(హౌస్ సర్జన్) పూర్తి చేసింది. మంగళవారం ఆమెను కాలనీవాసులు, మిత్రులు శాలు వాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. శ్రీనివాస్, నాగరాజు, సత్తన్న, రవి, వెంకటేశ్, శ్రీనివాస్, రాజశేఖర్, అభి, కిషన్, తదితరులు ఉన్నారు.

కడెం ఆయకట్టుకు సాగునీరు

దస్తురాబాద్: కడెం ఆయకట్టు పరిధిలోని దస్తురాబాద్, కడెం మండలాల పంటలకు మరో నాలుగు రోజులు సాగునీరు విడుదల చేయనున్నట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. పంటలు చివరి దశలో ఉన్నందున రైతుల సమస్యను కలెక్టర్, నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి విడుదలకు ఒప్పించినట్లు తెలిపారు. రైతులు ఈ సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపా రు. ఇప్పటికే ఆయకట్టుకు ఏడు తడులు అందించినట్టు పేర్కొన్నారు.


యూడైస్ ప్లస్ సర్వే



పీచరలో పరిశీలిస్తున్న ఛాత్రోపాధ్యాయురాలు

లక్ష్మణచాంద: మండలంలో యూ డైస్ ప్లస్ సర్వే ప్రారంభమైంది. మంగళవారం మండలంలోని పీచర ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలతోపాటు ధర్మారం, చింతల్‌చాంద, చామన్‌పెల్లి, తిర్పెల్లి ప్రాథమిక పాఠశాలలను ఛాత్రోపాధ్యాయులు సందర్శించి వసతుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఎంఈవో అశోక్‌వర్మ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు మహేందర్, సుధాకర్ ఛాత్రోపాధ్యాయులు పూజ, రజని, సోఫియా మహిన్ తదితరులు పాల్గొన్నారు.

గోఆధారిత సేద్యం చేయాలి



భూమి రక్షిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న రైతులు

కుభీర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ గోఆధారిత వ్యవసాయం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ విభాగం గ్రామవికాసం రాష్ట్ర సహ సంయోజక్ వేంపల్లి ప్రదీప్ అన్నారు. మంగళవారం కుభీర్ శ్రీవిఠలేశ్వర స్వామి మందిరంలో గ్రామవికాసం, భూ సార రక్షణ, గోఆధారిత వ్యవసాయం రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి పంటలకు సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వస్తువులకు దూరం ఉంటూ పొలం గట్లపై మొక్కల పెంపకం చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా గ్రామవికాస ప్రముఖ్ నాగమణి లింగన్న, ఆర్‌ఎస్‌ఎస్ ఖండ కార్యవాహ పోశెట్టి, హన్మండ్లు, శ్రీనివాస్, శివలింగు, ఆర్.హన్మండ్లు, తిరుపతి, శివలింగు, సుభాష్ చొండి, బెల్లాం, రాజురా, కుభీర్ రైతులు పాల్గొన్నారు.

రైతుల ఆశలకు 'గండి'

- 'సిరాల' తెగడంతో అడుగంటిన భూగర్భ జలాలు
- వట్టిపోతున్న బోర్లు.. కొత్తగా వేసినా నీరు రాని వైనం
- వరి పంట చేతికి రావడం కష్టమే..



సిరాల ప్రాజెక్టు కింద నీరు అందక ఎండుతున్న వరి పొలం



ఎండుతున్న మొక్కజొన్న చేను



వట్టిపోయిన బోరుబావి

భైంసా/భైంసారూరల్: జిల్లాలోని సిరాల ప్రాజెక్టు, ఒకప్పుడు ''అన్నపూర్ణ''గా పిలువబడి రైతులకు సాగునీటిని అందించి సస్యశ్యామలం చేసింది. 1902లో నైజాం కాలంలో నిర్మితమైన ఈ ప్రాజెక్టు 2023 వరకు సుమారు 120 ఏళ్లపాటు ఆయకట్టు రైతులకు జీవనాధారంగా నిలిచింది. రెండేళ్ల కిందట భారీ వర్షాలకు ప్రాజెక్టు తెగిపోవడంతో రైతుల జీవన విధానం పూర్తిగా మారిపోయింది. రెండేళ్లుగా కొనసాగుతున్న ప్రాజెక్టు మరమ్మతులు.. ఇప్పటికీ పూర్తి కాలేదు. దీంతో గ్రామాల్లో పంటలు పండక, బోర్లు వట్టిపోయి ఆయకట్టు రైతులు నష్టాలను చవిచూస్తున్నారు.

రైతులకు ఆధారం..

1902లో సిరాల ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమై, సిరాల, ఇలేగాం, ఉమ్రి, బోల్సా, బోరిగాం, బెల్‌తరోడ, మాంజ్రి వంటి గ్రామాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించి, రైతులకు ఆశాకిరణంగా నిలిచింది. వరి, మొక్కజొన్న వంటి పంటలు సమృద్ధిగా పండి, ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారింది. అయితే, 2023లో వరదల కారణంగా ప్రాజెక్టు గోదావరి ఉపనది ఒడ్డున తెగిపోవడంతో ఆయకట్టు కింద 230 ఎకరాలకు సాగునీరు అందడం ఆగిపోయింది.

వట్టిపోయిన బోర్లు..

ప్రాజెక్టు నుంచి సాగునీరు రాకపోవడంతో రైతులు ఆశ్రయించిన ఏకైక మార్గం బోరుబావులు. గత రెండేళ్లలో సిరాల ఆయకట్టు కింద 130కి పైగా బోర్లు వేయించిన రైతులు.. గతేడాది కొంతమేర నీటిని సమకూర్చుకున్నారు. అయితే 2025లో భూగర్భ జలాలు అడుగంటడంతో ఈ బోర్లలో 90 శాతానికి పైగా వట్టిపోయాయి. కేవలం 10 బోర్లు మాత్రమే నీటిని అందిస్తున్నాయి.. అవి కూడా అతి తక్కువ స్థాయిలో. 100 నుంచి 120 అడుగుల లోతులో నీరు దొరికిన బోర్లు కూడా ఇప్పుడు ఎండిపోతుండటంతో, రైతులు పంటలకు నీటిని అందించలేని దుస్థితిలో ఉన్నారు. పొట్టదశకు చేరిన మొక్కజొన్న, వరి వంటి పంటలు ఎండిపోతున్నాయి.

పొట్టదశలో పంటలు....

సిరాల, ఇలేగాం, ఉమ్రి, బోల్సా, బోరిగాం, బెల్‌తరోడ, మాంజ్రి ఇలా చుట్టుపక్కల గ్రామాల్లో బోరుబావులన్ని వట్టిపోయాయి. గతంలో సిరాల ప్రాజెక్టులో ఎప్పుడు నీరు ఉండేది.

చుట్టుపక్కల బోర్లన్ని నిండుగా నీరుపోసేవి. ప్రస్తుతం ప్రాజెక్టు ఎండడంతో ఈ గ్రామాల్లోని 200లకుపైగా బోరుబావులు వట్టిపోయాయి. పొట్టదశలో ఉన్న పంటలకు నీటి తడి అందడం లేదు. మొక్కజొన్న, వరి పంటలకు నీరందక చేతికి అందే పరిస్థితిలేదు.

మరమ్మతుల్లో జాప్యం..

సిరాల ప్రాజెక్టు మరమ్మతు పనులు ఆలస్యం కావడంతో రైతులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ''మా జీవనాధారం అయిన సిరాల ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నాం. రెండేళ్లుగా ఎదురుచూస్తున్నాం, కానీ పనులు ముందుకు సాగడం లేదు'' అని సిరాల గ్రామానికి చెందిన రైతు రాములు ఆవేదన వ్యక్తం చేశాడు. సాంకేతిక సమస్యలు, నిధుల కొరత, గుత్తేదారుల నిర్లక్ష్యం వంటి కారణాలతో పనులు ఆలస్యమవుతున్నాయి.

పొలం ఎండుతుంది



సిరాల ప్రాజెక్టు కింద ఉన్న వరి పొలం ఎండుతుంది. నాటువేసిన నుంచి బోరు మోటారుతోనే నీరు అందించాం. ఇప్పుడు బోరు వట్టిపోయింది. కొత్త బోరువేసిన నీళ్లు పడటం లేదు. ఈయేడు వరికి నీరు అందడం కష్టంగానే అనిపిస్తుంది. కళ్ల ముందే పచ్చని పొలం నీరు లేక బీటలు వారింది.

– వీరేశ్, రైతు, ఇలేగాం

పంట నష్టపోతున్నాం



సిరాల ప్రాజెక్టు తెగిపోవడంతోనే రైతులందరికీ కష్టాలు మొదలయ్యాయి. ప్రస్తుతం పంటలు ఎండిపోతున్నాయి. రెండేళ్లుగా సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నాం. మా ప్రాంతంలో భూగర్భజలాలు తగ్గిపోయాయి. ఏం చేయాలో తోచడం లేదు. పొట్టదశలో నీటి తడి ఇవ్వలేకపోతున్నాం.

– పాపేశ్, రైతు, సిరాల

'ఎల్‌ఆర్‌ఎస్ పేరిట అక్రమ రిజిస్ట్రేషన్లు'

భైంసాటౌన్: ఎల్‌ఆర్‌ఎస్ పేరిట పట్టణంలోని ప్రభుత్వ, దేవాదాయ శాఖ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని బీజేపీ నాయకుడు కపిల్ సిందే ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని సర్వే నం.133 అసైన్డ్ భూముల జాబితాలో ఉండగా వాటిలో కొన్ని ప్లాట్లను ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి సహకరించేలా మున్సిపల్ కమిషనర్ ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు. ఆయా ప్లాట్లకు జారీచేసిన ప్రొసీడింగ్‌లను రద్దు చేసి.. కమిషనర్, సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదాయ వనరులు పెంచుకోవాలి



షెడ్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీవో అజీజ్‌ఖాన్

నర్సాపూర్(జి): పంచాయతీలు ఆదాయ వనరులు పెంచుకోవాలని డీఎల్‌పీవో అజీజ్‌ఖాన్ పేర్కొన్నారు. మండలకేంద్రం శివారులోని సెగ్రిగేషన్ షెడ్డును మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి తయారు చేసిన సేంద్రియ ఎరువును అమ్ముకోవాలని సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. పన్నులు సకాలంలో వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, కార్యదర్శి రాథోడ్ కైలాస్ పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రానీయొద్దు

- అత్యవసరమైతే ట్యాంకర్లతో సరఫరా చేయాలి
- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ముధోల్: వేసవి నేపథ్యంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూస్, రెవెన్యూ, పంచాయతీ, ఈజీఎస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా నీటి సమస్యలున్నట్లు చెబుతున్నారని.. ఎప్పటికప్పుడు నీటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గంలో మిషన్ భగీరథ పనులు అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అత్యవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని.. లేకుంటే బోరు బావులు వేసి నీరు అందేలా చూడాలని పేర్కొన్నారు. ఈజీఎస్ పథకం కింద గ్రామాల్లో మంజూరైన రోడ్ల నిర్మాణ పనులను సత్వరం ప్రారంభించాలని ఆదేశించారు. ఉపాధిహామీ పథకం కింద రూ.కోట్లు మంజూరవుతున్నా.. అధికారులు నిర్లక్ష్యంతో పనులు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రోడ్ల పనులు సజావుగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్, ఆర్‌డీవో కోమల్‌రెడ్డి, ఈఈ సందీప్, రాఘవేంద్రరాజు, జిల్లా, మండలాల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏపీవోలు, టీఏలు, ఐకేపీ అధికారులు, తదితరులు ఉన్నారు.

క్షణికావేశంలో జీవితాలు నాశనం చేసుకోవద్దు

- ఎస్పీ జానకీషర్మిల



కౌన్సెలింగ్‌తో ఏకమైన జంటతో ఎస్పీ

భైంసాటౌన్: క్షణికావేశంతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పోలీస్ ప్రజావాణి నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం భరోసా కేంద్రాన్ని సందర్శించారు. భరోసా కేంద్రం సిబ్బంది కౌన్సెలింగ్‌తో ఏకమైన జంటతో ఎస్పీ మాట్లాడారు. సిబ్బంది కృషిని ఆమె అభినందించారు. పోలీసు సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐలు నైలు, గోపీనాథ్, మల్లేశ్, ఎస్సైలు శంకర్, గౌసుద్దీన్, గణేశ్, భరోసా సెంటర్ సిబ్బంది జ్యోతి, శిరీష, క్యాంప్ ఇన్‌చార్జి రఘువీర్ పాల్గొన్నారు.

'మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించండి'



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న రజక సంఘం నేతలు

నిర్మల్‌చైన్‌గేట్: దుబాయ్‌లో మృతి చెందిన సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టం ప్రేమ్ సాగర్ కుటుంబానికి అండగా ఉంటామని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి తెలిపినట్లు ఆ పార్టీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ్‌సాగర్ మృతదేహాన్ని స్వదేశానికి తిరిగి తెచ్చేలా విదేశాంగ మంత్రిత్వశాఖ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు.

సోన్: మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్‌సాగర్ దుబాయ్‌లో హత్యకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం రజక సంఘం మండల నాయకులు మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జానకీ షర్మిలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, రజక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండలకేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం 20 మంది దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి మంగళవారం భవిత విద్యావనరుల కేంద్రంలో నిర్వహించే వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐఆర్టీ రాము సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



కాలిన పంట పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామారావు

భైంసారూరల్: మొక్కజొన్న చేను కాలిపోవడంతో నష్టపోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకుంటామని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. మండలంలోని మహాగాం లో కారగిరి సాయినాథ్ అనే రైతు రెండెకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటకు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఆహుతైంది. మంగళవారం చేనును పరిశీలించి బాధిత రైతు నుంచి వివరాలు తెలుసుకున్నారు. చేను మొత్తం కాలిపోయిందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది. రాకేశ్, చిన్నన్న తదితరులు ఉన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



చెక్కులు అందిస్తున్న నారాయణ్‌రావు పటేల్



కుంటాలలో చెక్కు అందిస్తున్న విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు అండగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ అన్నారు. పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో మంగళవారం నియోజకవర్గంలోని పలువురికి ఆయన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. గంగారెడ్డికి రూ.60వేలు, తబస్సుం బేగంకు రూ.22వేలు, అజర్ అలీ మొహ్మద్‌కు రూ.60వేలు, అనీసా బేగంకు రూ.19వేలు, గొల్లమాడ అభిలాష రెడ్డికి రూ.35వేలు, బోతేకర్ గణపతికి రూ.25వేలు, ఆడెపల్లి హరితకు రూ.60వేల విలువైన చెక్కులు అందించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, ముత్యంరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో గీజా భూమవ్వ, మొండోల్ల చిన్న మోహన్‌కు ఒక్కొక్కరికి రూ.24వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. మంగళవారం బీజేపీ నాయకులు వారి ఇళ్లకు వెళ్లి చెక్కులను అందించారు. కార్యక్రమంలో మంద భాస్కర్, సంజీవ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, సాయాగౌడ్, సాహెందర్, అనిల్ పటేల్ ఉన్నారు.

17 మందికి చెక్కుల పంపిణీ

కుంటాల: ఉమ్మడి కుంటాల మండలానికి చెందిన 17 మందికి రూ.ఆరున్నర లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం కుంటాలలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పంపిణీ చేశారు. అర్హులందరికీ రైతుభరోసా సాయం అందుతుందని.. ఎవరూ అధైర్యపడొద్దని పేర్కొన్నారు. జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, పీఏసీఎస్ చైర్మన్ గజ్జారాం, గంగామణి బుచ్చన్న, జుట్టు లక్ష్మణ్, సమతా వెంకటేశ్, రమణగౌడ్ పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ



నిర్మల్‌లో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది



ఖానాపూర్‌లో విన్యాసం ప్రదర్శిస్తున్న సిబ్బంది

నిర్మల్‌టౌన్: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని నిర్మల్ ఫైర్ అధికారి రాజలింగం అన్నారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా నిర్మల్ పట్టణంలోని పలు దుకాణదారులకు అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కల్పించారు. కిరణ దుకాణాలు, పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్స్‌లో పోస్టర్లు అంటించారు. ప్రమాదం జరిగితే ఫైర్ ఇంజిన్ వచ్చే దాకా ఎదురు చూడకుండా మంటలను ఆర్పే ప్రయత్నం చేయాలన్నారు. ఫైర్ సిబ్బంది సుభాష్, రమేశ్, హుస్సేన్ షా, ఫిర్దౌస్ తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని భైంసా అగ్నిమాపక శాఖ అధికారి రవి అన్నారు. అగ్నిమాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. అనంతరం గోడప్రతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి జావెద్ అలీ, లీడింగ్ ఫైర్‌మెన్ ఖదీర్ ఖాన్, డ్రైవర్ మహేందర్, ఫైర్‌మెన్ వెంకటేశ్, శ్రీకాంత్, సాయిచరణ్, నరేశ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

దస్తురాబాద్: భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గం భవాని అన్నారు. మంగళవారం దస్తురాబాద్‌లోని దళితవాడలో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను నమ్మొద్దని.. అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు గంగవ్వ, నాయకులు పుష్పలత, సురేఖ, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.


రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

సారంగపూర్: రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య అన్నారు. మండలంలోని దుర్గానగర్‌లో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా ప్రజలంతా ఏకతాటిపైకి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్, రాము, బాబులాల్ తదితరులు ఉన్నారు.

'రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలను తిప్పికొట్టాలి'

ఖానాపూర్: భారత రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం రాజ్యాంగ విచ్ఛిన్నంపై కుట్రలను వెనక్కి తీసుకోకుంటే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.


'కేంద్ర పథకాలను ఇంటింటికీ చేరవేయాలి'



మామడలో మాట్లాడుతున్న సాగర్

మామడ: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరవేసి.. స్థానికసంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఆ పార్టీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ అన్నారు. మంగళవారం మామడలో పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా మండల సమావేశం నిర్వహించారు. బూత్ లెవల్ కమిటీల ఏర్పాటు అనంతరం మండల కమిటీల నియామకం జరుగుతుందని పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పది రోజుల పాటు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కన్వీనర్ రంజిత్‌కుమార్, జిల్లా కార్యదర్శి శ్రవణ్‌రెడ్డి, బాపురెడ్డి, రాజారెడ్డి, లింగారెడ్డి, నవీన్, సురేందర్, చిన్నారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

ఎండలో పనులు, ప్రయాణాలు వద్దు



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న సిబ్బంది

దస్తురాబాద్: ఎండలో ప్రయాణాలు చేసి వడదెబ్బ బారిన పడొద్దని ఆరోగ్య విస్తరణాధికారి కన్నయ్య అన్నారు. మంగళవారం మండలంలోని ఆకొండపేట గ్రామంలో వడదెబ్బపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నోరు తడారి పోవడం, తరచుగా దాహం వేయడం వడదెబ్బ లక్షణాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ మల్లేశం, ఆశకార్యకర్త భారతి తదితరులు ఉన్నారు.